


మయూర షుగర్ ఫ్యాక్టరీ వేలం వాయిదా

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ

మయూర షుగర్ ఫ్యాక్టరీ బివిఎన్ కండ్రిగ మండలం విజయ గోపాలపురం గ్రామంలో ఉంది. రైతులకు పెద్దఎత్తున బకాయిలు పడడంతో దీర్ఘకాలికంగా వారు చేసిన పోరాటాల ఫలితంగా ఫ్యాక్టరీ స్థిరాస్తులు వేలం వేసి చెల్లించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం స్థిరాస్తులు వేలంపాటను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతి జీవో నెంబర్ డబ్ల్యుపి 13600 / 2023 ప్రకారం ఈనెల 30న ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సి ఉంది. అయితే ఇంటీరియర్ స్టే ఉత్తర్వులు జారీ చేసిన కారణంగా సదరు వేలంపాట నిర్వహించే తేదీ, ప్రదేశమును బుచ్చినాయుడు కండ్రిగ తహశీల్దార్ హనుమాన్ నాయక్ పత్రికా ముఖంగా తెలియజేస్తామనితెలిపారు. పై విషయాన్ని రైతులు, సంబంధిత గ్రామస్తులు గమనించాలని కోరారు.

పైసలిస్తేనే 'సదరం' సర్టిఫికెట్



• అనర్హులకు అందలం • అర్హులకు మొండిచెయ్యి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వైకల్య శాతాన్ని నిర్ధారిస్తూ అధికారులు ఇచ్చే ధ్రువీకరణ పత్రమే పింఛను, ఇతర ప్రభుత్వ సదుపాయాలు పొందేందుకు ప్రామాణికం. అయితే పింఛన్ల మొత్తాల పెంపు, కొత్త పెన్షన్ దరఖాస్తుల నేపథ్యంలో సదరం సర్టిఫికెట్లకు డిమాండ్ ఏర్పడింది. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు అవినీతికి తెర తీస్తున్నారు. వికలత్వ నిర్ధారణ ధ్రువీకరణ పత్రం కావాలంటే మామూళ్లు సమర్పించుకోవాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. వికలత్వం ఉండీ ధ్రువీకరణ పత్రం కావాలంటే ఓ రేటూ, తక్కువ స్థాయిలో వికలత్వం ఉన్న వారికి ఇంకోరేటూ, అసలే వికలత్వం లేకున్నా ధ్రువీకరణ పత్రం పొందాలంటే మరో రేటును నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు. స్థానిక శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న సదరం శిబిరంలో ఈ తంతు మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆరోగ్య శ్రీ లో పనిచేసే ఓ ఉద్యోగి ఓ ప్రజాప్రతినిధి మనిషినంటూ ఈ సదరం సర్టిఫికెట్ల అవినీతికి తెరతీస్తున్నట్లు బాధితులు వాపోతుండటం విచారకరం.

గతంలో వికలత్వ ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే తిరుపతిలోని సదరం శిబిరానికి వెళ్ళాల్సి వచ్చేది. శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరు పేట నియోజకవర్గాల ప్రజలకు ఇది వ్యయప్రయాసలతో కూడుకున్న పని. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి లో సదరం శిబిరం నిర్వహించేందుకు అనుమతి ఇచ్చారు. అప్పట్లో కేవలం ఎముకలకు సంబంధించిన వికలత్వాన్ని నిర్ధారించేందుకు మాత్రమే అనుమతి ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వ ఏర్పడ్డాక చెవి, నోరు, ఎముకలు తదితర వికలత్వ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అనుమతులిచ్చారు. ఈ క్రమంలో వికలత్వ ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారు ఆన్లైన్ లో స్లాట్ బుక్ చేసుకుని అక్కడ ప్రభుత్వం నిర్ణయించిన రుసుము చెల్లించి



కేటాయించిన గడువులో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. అయితే ఇక్కడే అసలు సమస్య తలెత్తుతోంది. వికలత్వ శాతాన్ని నిర్ధారించేందుకు వైద్యులు మామూళ్లు అడుగుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆరోగ్యశ్రీ లో పని చేసే ఓ ఉద్యోగి తాను ఓ ప్రజాప్రతినిధి మనిషినంటూ రేట్లు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు సమాచారం. అందులోంచి కొందరు వైద్యులకు వాటాలు వెళుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. అనర్హుల నుంచి రూ.4 నుంచి రూ.5 వేల వరకు మామూళ్లు తీసుకుని ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. అర్హులకు మాత్రం మొండిచెయ్యి చూపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సదరం శిబిరాలపై ఓ కన్నేయాల్సిన అవసరం ఉంది.

విచారించి చర్యలు చేపడతాం: డా. విజయలక్ష్మి, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి.

వికలత్వ ధ్రువీకరణ పత్రాలకు మామూళ్లు తీసుకున్నట్లు మా దష్టికి రాలేదు. ప్రభుత్వ వైద్య సిబ్బంది ఎవరూ ఆ పనికి పాల్పడ్డా ఉపేక్షించం. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాం. అర్హత కలిగిన వారికే వికలత్వ ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు చేపడతాం.

పారిశుధ్య కార్మికులకు జీవో ప్రకారం జీతాలివ్వాలి

సఫాయి కర్మచారి జాతీయ కమిషన్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

టిటిడి, స్విమ్స్, రుయాలో పని చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు కలెక్టర్ జీవో ప్రకారం జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తిరుపతి పర్యటనకు విచ్చేసిన సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశ్‌కు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. స్థానిక పద్మావతి అతిథిగృహం వద్ద శనివారం ఆయన్ని కలిసిన సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ టిటిడి, తిరుపతి మున్సిపాలిటి, స్విమ్స్, రుయా, మెటర్నిటీ, బర్డు ఆసుపత్రుల్లో, రైల్వే రంగంలో ఏళ్ల తరబడి పారిశుద్ధ కార్మికులు పని చేస్తున్నారని, వారికి సఫాయి కర్మచారి కమిషన్ సూచించిన నిర్ణయాలు, వేతనాలు అమలు కావడం లేదన్నారు. తిరుపతి మున్సిపాలిటీలో ఇద్దరు కార్మికులు విధులు నిర్వహిస్తూ మృతి చెందినా, వారికి చట్టప్రకారం న్యాయం జరగలేదన్నారు. చాలీచాలనీ వేతనాలతో కార్మికులు అవస్థలు పడుతున్నారని, వారికి కనీసం



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు మునిరాజ

కలెక్టర్ జారీ చేసిన జీవో ప్రకారం అయినా వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టిటిడి నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ శ్రీనివాసా కార్పొరేషన్‌లో కార్మికులను విలీనం చేసి, కాంట్రాక్టు విధానాన్ని రద్దు పరిచి, వేతనాలు పెంచాలన్నారు. టిటిడిలో ఎఫ్ఎంఎస్ విభాగంలో పని చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు బ్రహ్మోత్సవ బహుమానం పెండింగ్ డిఏలను చెల్లించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్క్‌ర్సు యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘు, సిఐటియు నాయకులు మునిరాజ పాల్గొన్నారు.

కబ్జాదారు నుంచి చెరువును కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ తిరుచానూరు పంచాయతీలో ఉండే యోగిమల్లవరం దగ్గర ఎగువ మల్లవరం చెరువును ఆక్రమించుకుని ఇల్లు నిర్మిస్తున్న భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, నాయకులు జయచంద్ర, పి.సాయిలక్ష్మి, తిరుచానూరు సిపిఎం పంచాయతీ కార్యదర్శి కె.సుమన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగిమల్లవరం దగ్గర ఉన్న ప్రభుత్వ భూమి, చెరువుల సర్వే నంబర్ 1/1, 1/2లో ఉన్న ప్రభుత్వ చెరువు భూమి 12 ఎకరాల 40 సెంట్లు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికీ కోర్టులో కేసు ఉన్నప్పటికీ దానిని ఏమాత్రం లెక్క చేయకుండా ఇళ్లు నిర్మిస్తూ అమ్ముకుంటున్నారన్నారు. ఉన్న భూములైనా కబ్జాకాకుండా కాపాడాలంటే ఆ సర్వే నంబర్లు విచారణ చేసి, కంచె వేయాలని, ఈ భూమిలో బోర్డులు పెట్టాలని, ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, ఎం నరేంద్ర, నీలకంఠం, శేషాద్రి పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలనే లక్ష్యంతోనే 'సిబార్' స్థాపన

వీరనారాయణ మృతి కార్మికులకు తీరనిలోటు



ప్రజాశక్తి-తిరుపతి సిటి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి తోటి వారికి సాయం చేయాలనే ఉద్దేశంతో, పది మందికి ఉపాధి కల్పించేలా సిబార్ కంపెనీని స్థాపించి, అక్కడ పని చేసేవారికి అండగా ఉంటూ కార్మిక పక్షపాతిగా పి.వీర నారాయణ నిలిచారని ఆ కంపెనీ యజమానులు మదు ప్రతాప్, రవిచంద్ర తెలిపారు. రేణిగుంట రోడ్డులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్దనున్న సిబార్ కంపెనీ ప్రాంగణంలో వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ పైదాపురం మండలం, తుమ్మలతలుపూరు గ్రామంలో సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తన తండ్రి వీర నారాయణ బిటెక్ పూర్తి చేసి, ఉన్నత చదువులు చదువుకుని, తాను జన్మించిన నేలకు ఏదైనా చేయాలని తలిచారన్నారు. మెపెడ్స్ సుయేగాలో కొన్ని రోజులు పని చేసి, ఆ అనుభవంతో సొంతంగా ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యుల ప్రోత్సహంతో 1983, ఫిబ్రవరి 19వ తేది తిరుపతి-రేణిగుంట రోడ్డులోని ఎస్టేట్‌లో సిబార్ ఆటో పార్ట్స్ లిమిటెడ్‌ను స్థాపించారని తెలిపారు. ఆరుగురు సిబ్బందితో ప్రారంభించిన ఈ కంపెనీ 350 నుంచి 400 మందికి ఉపాధి కల్పించిన ఘనత ఉందన్నారు. తన వద్ద పని చేసే కార్మికులతో కలిసిపోతూ, వారి సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తూ, ఏ ఆపద వచ్చిన తాను ఉన్నాననే భరోసా ఇవ్వడంతో ఆయన వద్ద పని చేసేందుకు ఎక్కువ మంది మక్కువ చూపారని పేర్కొన్నారు. కార్మికుల సహకారంతో ఆయన వ్యాపార రంగాన్ని విస్తృత పరిచారని, చెన్నయ్, ఔరంగాబాదు, బెంగుళూరు, ఒరిస్సా వంటి ప్రాంతాలకు తన ఉత్పత్తులను సరఫరా చేసేవారన్నారు. నాణ్యతలో రాజీ పోకుండా, నమ్మకానికి మరో పేరుగా నిలిచారని కొనియాడారు. చుట్టుపక్కల గ్రామాలైన శెట్టిపల్లి, వెంకటాపురం, మిట్టగాంధీపురం, రేణిగుంట, ఎర్రమరెడ్డిపాళెం, తూకివాకం, వినాయకనగర్, పన్నీరు కాల్వ తదితర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులతో మంచి పరిచయాలు కలిగి, అందరికి సుపరిచితుడైన ఆయన ఈ నెల 22వ తేదీన ఆకస్మిక మరణం చెందడం బాధాకరమన్నారు. ఆయన ఆశయ సాధనకు, కంపెనీ అభివృద్ధికి, కార్మికులకు భరోసా కల్పించేందుకు తమ శాయశక్తులా ప్రయత్నిస్తామని తెలిపారు.



513 అక్రిడేషన్లు మంజూరు : కలెక్టర్


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అర్హత కలిగిన మీడియా ప్రతినిధులకు 2023, 2024 రెండు సంవత్సరాల కాలపరిమితితో 513 మందికి అక్రిడేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. శనివారం ఉదయం కలెక్టరేట్లో జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ తొలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జీవోను అనుసరించి నిబంధనల మేరకు అర్హులకు అక్రిడేషన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు, పీరియాడికల్, ఫ్రీలాన్సర్స్, వెటరన్ పాత్రికేయులలో అన్ని నిబంధనలు పూర్తిచేసిన వారికి మొదటి విడతలో 513 మందికి అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అక్రిడేషన్ మంజూరు కాని వారికి జీవోలోని నిబంధనల మేరకు సంబంధిత డాక్యుమెంట్స్ అన్ని ఆన్లైన్ ద్వారా సమర్పించిన పిదప తదుపరి కమిటీ సమావేశంలో పరిశీలించి అక్రిడిటేషన్లు మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో జర్నలిస్ట్ బస్ పాస్ ఎలిజిబుల్ అయ్యేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్, డిఐపిఆర్ఓ బాలకొండయ్య, కమిటీ సభ్యులు డిప్యూటీ చీఫ్ స్టాఫ్ రిపోర్టర్ సాక్షి రవి రెడ్డి, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ , ది హాన్స్ ఇండియా డా.ప్రదీప్ కుమార్, ఎడిటర్ యువ దర్శిని పత్రిక ముని కృష్ణయ్య, స్టాఫ్ రిపోర్టర్ ఎన్టీవీ కార్తీక్ , స్టాఫ్ ఫోటోగ్రాఫర్ ఆంధ్రజ్యోతి లావణ్య కుమార్, డి పి ఆర్ ఓ విజయసింహారెడ్డి, ఏపీఆర్ఓ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

జీపాళ్యం, కుర్రకాల్వ స్థలాలు క్రమబద్ధీకరిస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రేణిగుంట మండలం జీపాళ్యం, కుర్ర కాలువ పరిధిలోని 204/3ఎ, 204/3బి స్థలాలలో కొంతమంది దళారుల మాటలు నమ్మి తెలియక డికెటి పట్టా భూములను కొనుగోలు చేసి మోసపోయిన భూ బాధితులకు అండగా ఉంటామని, వారు కొనుగోలు చేసిన భూములను రెగ్యులరైజ్ చేస్తామని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి హామీ ఇచ్చారు. శనివారంఉదయం కలెక్టర్ కార్యాలయంలో తనను కలిసిన భూ బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భూ బాధితులు పలువురు మాట్లాడుతూ కుర్రకాల్వ లెక్క దాఖలాలో రెండు ఎకరాల భూమిలో డి. సుబ్రహ్మణ్యం అనే దళారి మరికొందరు దళారులతో కలిసి తమకు 2016 వ సంవత్సరంలో డీకేటీ భూములు అమ్మారని, తమకు తెలియక మోసపోయి కొనుగోలు చేశామని, ఆ తర్వాతి రోజుల్లో ఈ భూములలో జగనన్న ఇళ్ల పథకం ప్రకటించినపుడు తాము నిర్ఘాంత పోయామని జిల్లా కలెక్టర్ కు వివరించారు. దళారి డి. సుబ్రహ్మణ్యం బాధితులు ఒకొక్కరి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి ప్లాట్లు అమ్మడమే కాకుండా, తాజాగా కోర్టు జడ్జిమెంట్ వచ్చిందనే పేరుతో రూ.40వేలు, ఇంటి పన్ను, కరెంటు కనెక్షన్‌కు మరో రూ.20వేలు, ఇంటిని నిర్మిస్తామని లక్ష నుంచి రెండు లక్షల రూపాయలు బలవంతంగా ఒక్కొక్కరి నుంచి వసూలు చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. దళారుల మాటను అంగీకరించని వారిపై దౌర్జన్యానికి పాల్పడడం, తీవ్రమైన బూతు పదాలను ప్రయోగించడం, సొంత రౌడీలను పెట్టుకుని స్థలాల వద్ద భూభాధితులపై దాడికి పాల్పడుతున్నాడని కలెక్టర్ కు బాధితులు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వెంకటరమణారెడ్డి దళారులను ఆ భూముల వైపు కన్నెత్తి చూడనీయవద్దని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణం కేసులు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ భాధితులు ఎవరికీ పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే తమకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని తాము కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ బాధితులకు న్యాయం చేస్తానని ప్రకటించిన జిల్లా కలెక్టర్ కు బాధిత ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భూ బాధితులు చిన్నా, బాలసుబ్రమణ్యం, ఉదయకుమార్, శ్రీనివాసులు, గణేషు, సుభద్ర, మునిశేఖర్, వాసు, బాబు తదితరులు ఉన్నారు.



దళారుల చేతుల్లో మోసపోయామని కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

వాలంటీర్ల సేవలు మరువలేనివి : ఎస్‌కెబాబు

తిరుపతి టౌన్ : వాలంటీర్ల సేవలు మరువలేనివని, వారి సేవలు అమోఘమని కార్పొరేటర్ ఎస్‌కెబాబు అన్నారు. 12, 13 డివిజన్లలో వాలంటీర్లకు వందనం సేవా పురస్కారాలను అందజేశారు. కార్పొరేటర్లు ఎస్‌కెబాబు, కొటూరు ఆంజనేయులు సంయుక్తంగా నిర్వహించారు. వాలంటీర్లకు ఇచ్చేది జీతంలా చూడకుండా గౌరవవేతనంగా భావించి సేవా గుణంతో పనిచేస్తున్నందుకు అభినందించారు. వేరే ముఖ్యమంత్రి వస్తే వాలంటీర్ల వ్యవస్థను రద్దు చేసి, జన్మభూమి కమిటీలు తెచ్చి దండుకుంటారన్నారు. కొటూరు శశి, మధు, రాజేష్ పాల్గొన్నారు.

జేసీబీ తొక్కించడంతో మహిళ మృతి

తిరుపతి టౌన్ : కొర్లగుంట మారుతీనగర్‌లో రోడ్డు విస్తరణ పనుల్లో శనివారం మధ్యాహ్నం వరలక్ష్మిని జేసీబీ డ్రైవర్ తొక్కించారు. ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు రుయాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సిపిఎం నేతలు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్ రుయాకు వెళ్లి చికిత్స పొందుతున్న మహిళను పరామర్శించారు. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వరలక్ష్మి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందన్నారు. కారకులైన అధికారులపై, కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే వరలక్ష్మి చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందింది. కాంట్రాక్టర్ ఆరు లక్షల రూపాయలను నష్టపరిహారంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆమె కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలని నేతలు డిమాండ్ చేశారు.

సివిల్స్ టాపర్ పవన్‌దత్తాను అభినందించిన పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సివిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ర్యాంకు సాధించిన డాక్టరు జివిఎస్ పవన్‌దత్తాను రాష్ట్ర విద్యుత్, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుష్పగుచ్చాలందించి అభినందించారు. న్యూ మారుతినగర్‌లోని మంత్రి నివాసంలో సివిల్ టాపర్ పవన్‌దత్తా మంత్రిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దుశ్శాలువాతో పవన్‌దత్తాను సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి అబినందించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ నేటి యువత పవన్‌దత్తాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు వారి వారి రంగాల్లో ప్రతిభను చూపాలని సూచించారు. పవన్‌దత్తా భవిష్యత్తులో మరెన్నో ఉన్నతస్థానాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు వై.ప్రవీణ్, రాధాకృష్ణవర్మ, మల్లారపు మధు, డాక్టరు జి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

టెక్నో, 'ఈ'టెక్నో, సిబిఎస్ఇ పేరుతో...

విద్య -4

'కార్పొరేట్'లో తోకల 'దందా'

ఫీజు నియంత్రణ పట్టని అధికారులు

ప్రజాశక్తి- తిరుపతి

సిబిఎస్ఇపై మోజు, కార్పొరేటు స్కూళ్లపై వ్యామోహంతో ఎక్కువమంది తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లల్లో చేర్పించేందుకు మక్కువ చూపుతున్నారు. ఇదే అదనుగా భావించిన కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వాహకులు స్కూల్ పేర్ల చివరన టెక్నో, ఈ టెక్నో, ఐఐటి, ఒలంపియాడ్, మోడల్, డిజిటల్, ఇంటర్నేషనల్, కాన్సెప్ట్ అంటూ తోకలు చేర్చి మరీ విద్యార్థుల తల్లిదండ్రులను బోల్తాకొట్టిస్తున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ పేర్ల చివర కేవలం ప్రైవేటు అనే ఉండాలి. తోక పేర్లు ఉండొద్దని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా ఈ నిబంధన అమలు కావడం లేదు. ఇప్పటికీ అనేక బడులకు తోకపేర్లు దర్శనమిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కొన్ని స్కూళ్లు బయట బోర్డు, బస్సులపై తొలగించినా, పేరెంట్స్‌కు పంపించే లెటర్లు, స్టూడెంట్స్ బుక్స్‌లో అవే దర్శనమిస్తున్నాయి. ఈ పేర్లతోనే కార్పొరేట్ మేనేజ్మెంట్లు పేరెంట్స్ నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

ఫీజులపై నియంత్రణేదీ?

ఫీజుల నియంత్రణలోనూ ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అయితే నిబంధనలను పక్కన బెట్టి ఈ విద్యాసంవత్సరాన్ని (2023-24)కి గాను పలు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు భారీగా పెంచాయి. ప్రస్తుతం ఉన్న ఫీజుల కంటే 15 నుంచి 20శాతం వరకు పెంచినట్లు విద్యార్థి సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. సీబీఎస్ఈ సిలబస్ అంటూ ఈ ఏడాది (2023-24) 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకు రూ.70వేల నుంచి రూ.90వేలు, 4వ తరగతి నుంచి 6వ తరగతి వరకు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగి వరకు, రూ.80 వేలు నుంచి లక్షా ఇరవై వేల వరకు ఫీజులు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. మంగళంలో ఇటీవలే ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ సిబిఎస్ఇ విద్యాసంస్థలో టర్మ్ ఫీజులను వసూలు చేసి మరీ అడ్మిషన్లను ముగించేయడం గమనార్హం. ప్రతి ఏడాదీ ఆయా పాఠశాలల యాజమాన్యాలు 20 శాతం నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచుతూనే ఉన్నా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పేరెంట్స్ కమిటీలపై మీన మేషాలు

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో సరైన నియంత్రణ లేకపోవడంవల్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఫీజుల విషయంలో ఈ కమిటీ నిర్ణయం తీసుకోవాలి. అలాంటిది ఏ ఒక్క పాఠశాలలోనూ అమలు కావడం లేదు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల విషయంలో ఒక్కసారి కూడా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ సారైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

చిన్నతనంలోనే 'మిస్టరీ' చేష్టలు

ప్రజా'దృష్టి'


ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఓ గ్రామమంతా గడగడలాడింది.. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భయాందోళనతో బతికారు.. పోలీసులకు ముచ్చెమటలు పట్టాయి. అధికార యంత్రాగానికి అవస్థలు తెచ్చిపెట్టింది. రాజకీయ నాయకులను పరుగులెత్తించింది. సాంకేతిక పరిజ్ఞానానికే సవాళ్లు విసిరింది ఓ 17 ఏళ్ల బాలిక. అమ్మ ప్రవర్తనలో మార్పు కోసం..అగ్గి ఆలోచనతో అదరకొట్టింది. ఎట్టకేలకు పోలీసుల నిఘాతో మిస్టరీ మంటలకు తెరపడింది. అమ్మకోసం ప్రయత్నించి కీర్తి కటకటాలపాలైంది. చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన ఈ వ్యూహ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మిస్టరీ ఛేదనతో కథ సుఖాంతమయ్యింది.

తిరుపతి జిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గ కేంద్రం అందరికీ సుపరిచితమే. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు పాలించిన పాత్రం. అలనాటి చరిత్ర గుర్తుగా నేటికి రాజులకోట నిదర్శనంగా నిలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి, 40 ఈయర్స్ ఇండస్ట్రీ, నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంఎల్ఏలు ఆదర్శవంతుడని చెబుతున్న శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతం. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ నియోజకవర్గంలోని ఓ గ్రామం శానంబట్ల. ఇటీవల ఈ గ్రామం సంచలనానికి నెలవుగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశానికి తావిచ్చింది.

'మిస్టరీ మంటలు'.. ఈ పదం రాష్ట్రంలో ఇటీవల సంచలనమయ్యింది. శానంబట్ల గ్రామంలో నెల రోజుల పాటు ఎక్కడపడితే అక్కడ..ఎప్పుడు పడితే అప్పుడు ఉన్న ఫలంగా మంటలు వ్యాపించి, గడ్డివాములను, ఇళ్లల్లోనీ బీరువాలు, బట్టలు తదితర వాటిని మంటలకు దహనమయ్యాయి. ఊరంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితి. గ్రామదేవత గంగమ్మకు పూజలు చేయని పాపమే ఇదని, అమ్మ ఆగ్రహించిందని అంటూ పుకార్లు పుట్టాయి. పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఊరు మొత్తం జల్లెడ పట్టారు. షార్టుసర్క్యూట్ ఏమైనా అవుతుందేమోనని విద్యుత్ సిబ్బందితో ఊరంతా క్షుణ్ణంగా పరిశీలించారు. అంతా బాగానే ఉంది. కానీ మంటలు ఎలా వస్తున్నాయో అర్థం కాలేదు. ఏ ఇంట్లో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయం. దీంతో చేసేది లేక పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరంతా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఇళ్లలో ఉండే గ్యాస్ సిలిండర్లను సైతం బయట పెట్టించారు. ఊరంతా సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. వందలాది మంది మహిళ పోలీసులతో పాటు పురుష పోలీసులు ఊరంతా పహారా కాశారు. ముంబాయి, పుణే వంటి ప్రాంతాల నుంచి సాంకేతిక నిపుణులను పిలిపించి, ఇక్కడ నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపారు. అయినా మంటలు ఆగలేదు. ఎక్కడ పడితే అక్కడ మంటలు ఎప్పడంటే అప్పడు వస్తూనే ఉన్నాయి. అధికార యంత్రాంగం ఆ గ్రామంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రాజకీయ నాయకులు సైతం పర్యటనలు చేస్తూ బాధిత కుటుంబాలను ఆదుకునే పని చేపట్టారు. అయినా అక్కడక్కడ మంటలు వ్యాపిస్తూనే ఉన్నాయి. గ్రామ దేవత ఆగ్రహం అనే ప్రచారం ఊపందుకుంది. మేధావులు, చదువుకున్న వారు సైతం అవునేమో అనేలా పరిస్థితులు దాపురించాయి. ఇంతలోనే నిఘాకళ్లుకు నిజం తెలిసింది. మిస్టరీ మంటలను పోలీసులు ఛేదించారు. గ్రామంలోనే 'కీర్తి' అనే ఓ 17 ఏళ్ల బాలిక ఇంటర్ ఫెయిలై ఇంటి వద్దే ఉంది. కీర్తి అమ్మ చుట్టుపక్కల మగవారుతో చనువుగా ఉంటూ ఇంటిలో ఇతర పురుషులతో గంటల తరబడి ఉండేది. దీన్ని గమనించిన కుమార్తె ఇది సరైనది కాదని అమ్మకు చెప్పింది. అమ్మ ఆమె మాటలను పెడచెవిన పెట్టింది. ఈ నేపథ్యంలో తమ ఇంటికి సమీపంలో ఉన్న ఓ గడ్డివాముకు విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. దీన్ని గమనించిన ఆ బాలికకు ఓ ఉపాయం తట్టింది. వెంటనే దాన్ని అమల్లో పెట్టింది. ముందుగా తమ ఇంటిలో గుడ్డలకు మంట పెట్టింది. తరుచూ తమ ఇంటికి వచ్చే పురుషుల ఇళ్లను ఎంపిక చేసుకుని రహస్యంగా వారి ఇళ్లల్లోని బీరువాలకు, బట్టలు ఆరేసిన దండ్యాలకు, ఇతరత్ర వాటికి నిప్పు పెట్టింది. తనపై అనుమానం రాకుండా మరోసారి ఇంటిలో అమ్మ నిద్రిస్తున్న సమయంలో అమ్మపక్కనే ఉన్న బట్టలకు నిప్పు పెట్టి అరుస్తూ పరుగులు తీసింది. చుట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఇలా సాగుతున్న మిస్టరీ మంటలకు పోలీసులు చెక్ పెట్టారు. గ్రామంలో రహస్యంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలకు ఓ బాలిక చిక్కడంతో ఆమెపై మరింత నిఘా పెట్టారు. సాక్ష్యాలతో సహా అమె పట్టుబడడంతో మిస్టరీ మంటలకు ఫుల్‌స్టాప్ పడింది. ఏది ఏమైనా తన తల్లి ప్రవర్తనను మార్చేందుకు పూనుకున్న ఆ బాలిక నేడు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యింది. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటనకు తెరపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీవారి సేవలో కీర్తి సురేష్



ప్రజాశక్తి-తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం నైవేద్య విరామ సమయంలో ప్రముఖ సినీనటి కీర్తి సురేష్ దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయక మండపంలో టీటీడీ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల కీర్తిసురేష్ మీడియాతో మాట్లాడుతూ స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలో భోలా శంకరుడు సినిమా రిలీజ్ ఉంటుందని తెలిపారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్లో రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగుల రోటరీ భరోసా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంస్థ తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు క్రమం తప్పకుండా క్లబ్ అధ్యక్షుడు ధనుంజయ రెడ్డి నేతృత్వంలో చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి దాతగా నెల్కాస్ట్ లిమిటెడ్ కంపెనీ సహాయ సహకారాలు అందించారని.. వారికి కృతజ్ఞతలు తెలిపారు. నెల్కాస్ట్ కంపెనీ ప్రతినిధి వెంకటేష్ మాట్లాడుతూ ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, ఈక్రమంలో రోటరీ వెస్ట్ క్లబ్ తో దివ్యాంగులకు పలు సరుకులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం దివ్యాంగులకు పలు సరుకులను పంపిణీ చేశారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్, యాదవ్, ఎస్. ఎస్. రెడ్డి, రవీందర్ రెడ్డి, వాసు గౌడ్, సుబ్రహ్మణ్యం, సిద్ధారెడ్డి, శ్రీను, కృష్ణంరాజు, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కల్పించాలి



ప్రజాశక్తి-బాలాయపల్లి: ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలకు పనుల వద్ద వసతులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండలంలోని సంఘవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పనుల వద్ద మజ్జిగ ఇవ్వాలన్నారు. నీడ కోసం పట్టలు ఏర్పాటు చేయాలన్నారు. ఇక కూలీలకు మాట్లాడుతూ రూ.272 గిట్టుబాటు కూలి రావాలంటే ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలన్నారు. కూలీలకు వేతనాలు ఆలస్యం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఏపీవో మత్యుంజయరావు, సుబ్రహ్మణ్యం, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతిగృహంలో అన్నదానం



ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణం గమళ్లపాలెం ప్రాంతంలోని మెప్మా మున్సిపాలిటీ సౌజన్యంతో నిర్వహిస్తున్న మై ఫ్రెండ్స్ అసోసియేషన్ వసతి గృహంలోని నిరాశ్రయులకు మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదన్నారు. ప్రతిఒక్కరూ సేవాదక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాలు వైపు దష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వాసు గౌడ్, రాము, బలరామిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

గుణశేఖర్‌కు ఏషియన్ ఐకాన్ అవార్డు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నారాయణవరం మండలం బ్రాహ్మణ తాంగేల్ గ్రామానికి చెందిన డాక్టర్ గుణశేఖర్ చదువుపై నిబద్ధతోపై ఉన్న చదువులు అభ్యసించి సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలన్న కోరికతో రసాయన శాస్త్రంలో పరిశోధనలు చేసి అనేక జాతీయ, అంతర్జాతీయ సెమినార్స్, కాన్ఫరెన్సులో ప్రసంగించారు. ఈ క్రమంలోనే బెంగళూరులో జరిగిన నేషనల్ యూనిటీ కాన్ఫరెన్స్ 2023లోలి గ్లోబల్ ఎకనామిక్ ప్రోగ్రెస్ అండ్ రీసెర్చ్ అసోసియేషన్ వారు జాతీయస్థాయిలో పరిశోధనలు చేసి విశేష ప్రతిభ కనబరిచే వారికి రెండేళ్లకు ఒకసారి ఏషియన్ ఐకాన్ గోల్డ్ మెడల్ అవార్డు ప్రదానం చేశారు. డాక్టర్ గుణశేఖర్ మధుమేహం వ్యాధిని తగ్గించే విధంగా ప్లాంట్ ఎక్స్ట్రాక్షన్ ఉపయోగించి మంచి ఫలితాన్ని కనుకున్నారు. (యాంటీ డయాబెటిక్)పై అనేక పద్ధతులను తన ప్రయోగం కొనసాగిస్తున్నారు. వీటిపైన ఇప్పటికే తన పరిశోధన పత్రాలను సమర్పించి ప్రచురించారు.

విద్యాకానుక బాధ్యతగా పంపిణీ చేయాలి



ప్రజాశక్తి-వెంకటగిరి: జగనన్న విద్యాకానుకలను బాధ్యతగా పంపిణీ చేయాలని ఎంఈవో పద్మావతి సూచించారు. శనివారం ఆంధ్రప్రదేశ్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యాకానుకల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లను అందించనున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు తమ దష్టికి వస్తే శాఖాపరమైన చర్యలతో పాటు, శిక్షార్హులవుతారని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఒకటో తరగతి విద్యార్థుల నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు ఈ కిట్లు అందించనున్నట్లు తెలిపారు. ఆమె వెంట రెసిడెన్షియల్ ప్రిన్సిపల్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే చర్యలు

గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్



ప్రజాశక్తి-కోట: కోట పట్టణంలో శిథిలావస్థలో ఉండే ప్రభుత్వ భవనాలను తొలగించి ఆ స్థానంలో ప్రజలకు వినియోగకరంగా ఉండే ప్రత్యామ్నాయ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ తెలిపారు. శనివారం కోట పట్టణంలో గూడూరు ఆర్డీవోతోపాటు డీఎస్పీ ఎం.సూర్య నారాయణరెడ్డి, అధికారులతో కలిసి పలు అభివద్ధి పనులను పరిశీలించారు. కోట అభివద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. దాదరాయగుంట సమీపంలోని ఆక్రమణల తొలగింపులో భాగంగా ఆరుగురి గహాలకు చెందినవారు కోల్పోతున్నారని.. వారికి కోట స్థానిక తహశీల్దారుకు తెలియజేస్తూ ప్రత్యామ్నాయంగా గ్రామ కంఠంలో ఉండే స్థలాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. లేకుంటే జగనన్న కాలనీలో గృహనిర్మాణానికి సాయంతోపాటు పలు వస్తు సామాగ్రిని ఉచితంగా అందించే చర్యలు తీసుకుంటామన్నారు. తూపిలిపాళెం రోడ్డు నుంచి కోట హరిజనవాడకు, గాంధీ విగ్రహం నుంచి దాదరాయగుంట వరకు సిమెంటు రోడ్లను సోమవారం నుంచి ప్రారంభిస్తామన్నారు. పోలీసు శాఖకు సంబంధించి రెండు ఎకరాల 71 సెంట్లు స్థలం ఉందని గుర్తు చేశారు. కోట అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఆక్రమణల తొలగించే విషయంలో ఎవరైనా అడ్డుపడితే 145 సెక్షన్ విధించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన రెండు తరగతి గదులను పరిశీలించి వాటిని జేసిబి సాయంతో తొలగించడం జరిగించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న బాలికల వసతిగహాన్ని పరిశీలించారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలాన్ని, ప్రస్తుతం ఉన్న కోట పంచాయతీ కార్యాలయం పంట కాలువ సమీపంలో ఉండే పోలీసు క్వార్టర్స్ ను పరిశీలించి ఆ స్థానంలో కోట బజారులో నుండి పాత ఆసుపత్రి మీదుగా కోట పంచాయతీ కార్యాలయాన్ని తొలగించి పాత పోలీసు క్వార్టర్స్ పై నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవనాలకు చేరుకునే విధంగా రోడ్డును నిర్మించనున్నట్లు చర్చించారు. అనంతరం డ్రైనేజీ కాలువ నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని, వాకాడు సీఐ హరికష్ణ, కోట ఎస్సై పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్ లో ఆక్రమణలు తొలగింపు

కోట: రోడ్డు వెడల్పు విస్తరణలో భాగంగా ఆక్రమణ భవనాలను సోమవారం నుంచి తొలగిస్తున్నట్లు గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ఆర్డీవో మాట్లాడుతూ రూ.140 కోట్లతో రోడ్డు వెడల్పుకు సంబంధించి నష్టపరిహారం చెల్లించే క్రమంలో భూములను సేకరించడం, ఆ భూముల్లో కోల్పోయిన భవనాలకు కేంద్ర ప్రభుత్వం రూ.3,600 కోట్లను కేటాయించడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్యాకేజీ 2 రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్యాకేజీ 3 కష్ణపట్నం రోడ్డుకు విద్యానగర్ నుండి సిక్స్ లైన్ రోడ్డు ఎంపికైందని, ఈ క్రమంలో ఆక్రమణలను తొలగించాలన్నారు. విద్యానగర్ ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకుంటామన్నారని తెలిపారు. సంబంధిత ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో సోమవారం నుంచి పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-తిరుపతి సిటి : రాష్ట్ర ప్రభుత్వం ద్వారా హజ్‌యాత్రకు తిరుపతి కేంద్రం నుంచి ఈ ఏడాది వెళ్లే యాత్రికులకు శిక్షణ, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టరు యు.శ్రీహరి ప్రారంభించారు. తుమ్మలగుంటలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలు పై బడిన వారందరికి మినింగ్ కోకల్ వ్యాక్సిన్ వేయించుకోవాలని, 65 సంవత్సరాలు పైబడిన వారికి ఆ రెండు వాక్సిన్లతో పాటు ఇన్ఫ్లుఎంజ వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఈ కార్యక్రమంలో శాంతికుమారి, జుబేర్ అహ్మద్, ఊర్మిళశ్వేత, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అపోలో ఆసుపత్రిలో...

అత్యాధునిక పరికరాలతో కాలేయ మార్పిడి



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: అపోలో ఆసుపత్రిలో అత్యాధునిక సాంకేతిక పరికరాలతో కాలేయ మార్పిడి చికిత్సను చేస్తున్నట్లు చెన్నైలోని అపోలో హాస్పిటల్ హెడ్ లివర్ డిసీజెస్, ట్రాన్స్‌ప్లాంటేషన్ డాక్టర్ ఎలం కుమారన్ తెలిపారు. శనివారం తిరుపతిలోని అపోలో క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేయడంలో అపోలో మంచి రికార్డు కలిగి ఉందని తెలిపారు. కాలేయ వ్యాధితో బాధపడుతున్న వారు ఇతర ప్రాంతాలకు చికిత్స కోసం వెళ్లకుండా నెల్లూరు, చెన్నైలో ఉన్న అపోలో ఆసుపత్రిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేషన్లు చేస్తున్నట్లు వెల్లడించారు. చెన్నై అపోలో ఆస్పత్రిలో సీనియర్ వైద్యులు ఉండటంతో చికిత్సను సులువుగా చేయడం జరుగుతుందన్నారు. తిరుపతికి చెందిన రోగులు అపోలో క్లినిక్ లో సంప్రదింపులు చేయాలని.. వారికి మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడానికి చెన్నై అపోలో ఆసుపత్రి డాక్టర్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

మహిళలకు ఆస్తిలో వాటా ఎన్టీఆర్ ఘనతే



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : మహిళలకు ఆస్తుల్లో సగం వాట ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనని చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ కాల్వ బసంతి పేర్కొన్నారు. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా పుత్తూరులో ఆమె మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా యూనివర్సిటీగా పద్మావతి యూనివర్సిటీని తిరుపతి లో స్థాపించి మహిళా పక్షపాతి అని ఎన్టీఆర్ నిరూపించారన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం ఇచ్చి పేదలు పట్టెడన్నం తినేలా చేసిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుందని పేర్కొన్నారు. పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లో అధికారంలోకి తీసుకురావడం భారతదేశంలో సాధించిన కీర్తి ఆయనది అన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-వెంకటగిరి: దేశ రాజధాని ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలియజేస్తూ, మహిళాలోకమంతా సంఘీభావంగా నిలబడాలని పిలుపునిస్తూ స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో శనివారం స్థానిక పల్లె వీధి కాళహస్తి శేషయ్య స్మారక లైబ్రరీ వద్ద సంఘీభావ కార్యక్రమం జరిగింది. సభ్యులు ఝాన్సీ అధ్యక్షత వహించారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యులు కె.అజిత మాట్లా డుతూ మహిళా రెజ్లర్‌లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ ల సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఇక తిరుపతికి ఇద్దరే డీఎస్పీలు

● తిరుపతి రూరల్ స్టేషన్‌గా ఎంఆర్‌పల్లి ● 1 నుంచి పలు స్టేషన్ల పరిధి మార్పు



ప్రజాశక్తి-తిరుపతి సిటి : తిరుపతి నగరంలో లా అండ్ ఆర్డర్‌కు ఇక ఇద్దరే డిఎస్‌పిలు ఉండనున్నట్లు, ఒక్కో డిఎస్‌పి పరిధిలోకి ఆరేడు పోలీసు స్టేషన్‌లు తీసుకొచ్చినట్లు తిరుపతి జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం, శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తిరుపతి పోలీసు జిల్లాలో పలు మార్పులు చేసిందన్నారు. తిరుపతి ఈస్ట్ సబ్ డివిజన్‌ను తిరుపతి సబ్‌డివిజన్‌గా, తిరుపతి వెస్ట్ సబ్‌డివిజన్‌ను రద్దు చేసి కొత్తగా చంద్రగిరి సబ్‌డివిజన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ముత్యాలరెడ్డిపల్లి (ఎంఆర్ పల్లి) పోలీసుస్టేషన్ పేరుతో తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌గా మార్పు చేసినట్లు వెల్లడించారు. తిరుపతి పరిధిలోని అలిపిరి, ఈస్టు, వెస్ట్, ఎస్‌వియు క్యాంపస్, తిరుచానూరు, ఎంఆర్ పల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో పలు మార్పులు చేశామన్నారు. జూన్ 1 నుంచి పోలీసు స్టేషన్లకు సంబంధించిన మార్పులు అమల్లోకి వస్తాయన్నారు. మారిన పరిధిల ప్రకారం సంబంధిత ప్రాంతాలకు చెందిన కేసులను నూతన పోలీసు స్టేషన్‌లకు బదిలీ చేయనున్నట్లు ఎస్‌పి తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు-నేడు పనులు వేగవంతం

తిరుపతి జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ సాధికారిక అధికారిణి జయలక్ష్మి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాడు-నేడు ఫేజ్-2లో కొత్తగా మంజూరైన పనులను వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ సాధికారిక అధికారిని జయలక్ష్మి సూచించారు. వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం మండలాల్లో జరుగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు నాడు-నేడు కార్యక్రమం కింద కొత్తగా మంజూరైన భవనాల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమీక్షించడం జరిగింది. భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని.. వర్షాకాలం రాకముందే నాడు-నేడు పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునేలా ప్రోత్సహించాలని.. వారిలో రక్తహీనత లేకుండా చూడాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూలు పూర్తి చేసుకున్న ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు ఒకటో తరగతిలో చేర్చే సమయంలో పిల్లల తల్లిదండ్రులకు అంగన్వాడీ సేవల గురించి తెలియజేసి అంగన్వాడీ సేవలను విస్తత పరచాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో కసిరెడ్డి పద్మజ, సూపర్వైజర్లు, వార్డు కౌన్సిలర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలలో భద్రత పెంపునకు టీటీడీ చర్యలు

ప్రజాశక్తి-తిరుమల: తిరుమలలో అనధికారిక వ్యక్తుల ఏరివేతకు టీటీడీ రంగం సిద్ధం చేసింది. తిరుమలలో హోటళ్లకు కేటాయించిన 24 కాటేజీలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ ప్రకటించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆదేశాల మేరకు శనివారం తిరుమలలోని స్థానికులతో భద్రతా చర్యలపై తిరుమల రెవెన్యూ కార్యాలయంలో టీటీడీ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ ఆఫీసర్ స్థానికులు, దుకాణదారులతో మాట్లాడుతూ తిరుమలలో భక్తులకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హోటళ్లకు కేటాయించిన 24 కాటేజీలను 3 రోజుల్లో ఖాళీ చేయాలని, ప్రత్యామ్నాయ వసతి కల్పించబడదని చెప్పారు. ప్రతినెలా విధిగా 5వ తేదీలోపు దుకాణాల లైసెన్స్ రుసుం చెల్లించాలని ఆదేశించారు. దుకాణాల్లో పనిచేసే వర్కర్ల డేటాతో పాటు పోలీస్ కేసులు లేకుండా సర్టిఫికేట్ ఉంచుకోవాలని కోరారు. ప్రతి దుకాణంలో వ్యాపారం చేసుకునే వస్తువులకు ప్లాస్టిక్ కవర్లు లేకుండా చూసుకోవాలన్నారు. హోటళ్లు, టీ దుకాణాల్లో ధరల పట్టిక కనపడేలా ఏర్పాటు చేసుకోవాలని.. తిరుమల నిబంధనలు ప్రకారం దుకాణాల్లో నిషేధిత వస్తువులు కలిగి ఉండకూడదని, ఎవరైనా నిషేధిత వస్తువులు కలిగి ఉంటే నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికంగా ఉన్న వ్యక్తులను పలు గ్రూపులుగా విభజించి బాలాజీ నగర్, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ లో శుద్ధ తిరుమల సుందర తిరుమల కార్యక్రమం నిర్వహిస్తామని ఎస్టేట్ ఆఫీసర్ తెలియజేశారు. రెవెన్యూ, టాస్క్ ఫోర్స్ ఏఈఓలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్, లీజు హోటళ్ల యజమానులు పాల్గొన్నారు.

చెరువులో శవమై తేలిన యువతి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక చిట్టేచెర్ల పంచాయతీ దాసరగూడెంకు సమీపంలో నాయినచెరువులో ఓ యువతి శవమై తేలింది. భాకరాపేట పోలీసులు సాయంత్రం ఘటనా స్థలానికి చేరుకుని చీకటి పడడంతో యువతి శవాన్ని వెలికి తీసేందుకు వీలుకాలేదు. గత మూడురోజులుగా తమ కుమార్తె కనపడలేదని వెతుకుతున్న దాసరగూడెంకు చెందిన సుబ్రమణ్యం కుమార్తె మీనా(23)గా గుర్తించారు. శనివారం యువతి శవాన్ని వెలికితీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రకాష్‌కుమార్ తెలిపారు.

పెత్తందారుల ఆధిపత్యంతో ఇబ్బందులు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పెత్తందారుల ఆదిపత్యంతో ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఇంటికి పైకప్పు వేసు కొనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎర్రవారిపల్లి మండలం, చెరుకులవారి పల్లి గిరిజన సామాజిక వర్గానికి చెందిన బాధితురాలు దొరబాబు, రేణుక ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2003 వ సంవత్సరంలో అప్పటి ఎమ్మార్వో ఒకటిన్నర సెంటు స్థలాన్ని మంజూరు చేశారన్నారు. అయితే తమకున్న ఆర్థిక స్తోమత దష్ట్యా కొద్ది కొద్దిగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టామన్నారు. ప్రస్తుతం ఇంటికి పైకప్పు నిర్మించుకోవాలని.. నిర్మాణ పనులు మొదలు పెడుతుంటే గ్రామంలోని అగ్రవర్ణాలకు చెందిన జయమ్మ, మల్లిరెడ్డిల మాటలు వింటూ స్థానిక తహశీల్దార్ దస్తగిరి ఇబ్బందులకు గురిచేస్తూ ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై గత రెండున్నర సంవత్సరాలుగా కోర్టులు, అధికారుల చుట్టూ పరిష్కారం కోసం తిరుగుతున్నామని, ఎక్కడ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా రెండేళ్లకు ముందు బిగించబడిన విద్యుత్ కనెక్షన్ అగ్రవర్ణాల ఒత్తిడితో ఎలక్ట్రికల్ ఏఈ తొలగించారని ఆరోపించారు. రేణుక, దొరబాబులపై అగ్రవర్ణాల దాడిని వ్యతిరేకిస్తూ అధికారులు అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని లేని పక్షంలో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని ఉమ్మడి చిత్తూరు జిల్లా గిరిజన నాయకులు జీవి రమణ హెచ్చరించారు. ఇల్లు కట్టుకోవడానికి హైకోర్టు నుండి ఉత్తరువు తీసుకొచ్చిన దానిని అధికారులు బేఖాతరు చేయడం వారి బరితెగింపునకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో ఆనంద, సరోజమ్మ, రాధిక పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఎర్రచందనం కూలీలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం రిజర్వు ఫారెస్ట్‌లోకి అక్రమంగా ప్రవేశించి గొడ్డళ్లతో భాకరాపేట, కల్యాణీ డ్యాం మార్గంలో పట్టుబడ్డ నలుగురిని టాస్క్ ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. టాస్క్ ఫోర్స్ డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబుల ఆదేశాలతో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బందం శుక్రవారం రాత్రి నుంచి భాకరాపేట వైపు ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళుతుండగా శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో శ్రీవారిమెట్టు మార్గం చేరుకునే సమయానికి ఆటోలో నలుగురు వ్యక్తులు అనుమానా స్పదంగా కనిపించారని అధికారులు తెలిపారు. వారిని చుట్టుముట్టి తనిఖీ చేయగా వారి వద్ద పిడిలేని ఇనుప గొడ్డలి, చుట్టబడిన రంపం, కొడవలి, పిడిలేని బారిస, ఆకురాయిలను గుర్తించామన్నారు. వీరు అడవిలోకి ఎర్రచందనం దుంగలు కొట్టడానికి వెళుతున్నట్లు ధవీకరించుకున్నామన్నారు. తమిళనాడు కల్లకురిచ్చి జిల్లా మేల్ వెల్లిమలైకు చెందిన ఆండి సైదయ్యన్(41), ఆండి వల్లి (51), పళని స్వామి (40), తిరుపతి జిల్లా చంద్రగిరి పాతపేటకు చెందిన వడమాలై జమని ఎలియాస్ జెమిని గణేష్ (46)లుగా గుర్తించామన్నారు. ఒక బజాజ్ ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి, ఎస్ఐ మోహన్ నాయక్ దర్యాప్తు చేస్తున్నారని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.

లుపిన్ డయాగ్నోస్టిక్స్‌లో శాటిలైట్ ల్యాబొరేటరీ ప్రారంభం



ప్రజాశక్తి - తిరుపతి సిటి : అంతర్జాతీయంగా ఫార్మా అగ్రగామి లుపిన్ లిమిటెడ్ (లుపిన్) ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయవాడలో తమ శాటిలైట్ ల్యాబొరేటరీని ప్రారంభించినట్లు లుపిన్ డయాగ్నోస్టిక్స్ సిఈఓ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం అయన విలేకర్లతో దేశవ్యాప్తంగా డయాగ్నోస్టిక్స్ నెట్‌వర్క్‌ను పెంచడం లక్ష్యంగా లుపిన్ డయాగ్నోస్టిక్స్ చేస్తున్న విస్తరణలో ఇది ఒక భాగం అన్నారు. దేశంలో 27 లేబరేటరీ, 410కి పైగా సేకరణ కేంద్రాలతో కూడిన లుపిన్ డయాగ్నోస్టిక్స్ నెట్‌వర్క్‌ను విస్తతం చేస్తుందన్నారు. ఈ కొత్త ల్యాబొరేటరీ అత్యాధునిక రోగనిర్ధారణ సాంకేతికతను కలిగి, అత్యున్నత అర్హతలు కలిగిన వైద్య నిపుణుల బృందంతో కూడిన సిబ్బందిని కలిగి ఉందన్నారు. సాధారణ, ప్రత్యేక పరీక్షలతో పాటు, విస్తతమైన రోగనిర్ధారణ సేవలను అందిస్తుంది. వీటిలో క్లినికల్ పాథాలజీ, మైక్రోబయాలజీ, హెమటాలజీ, బయోకెమిస్ట్రీ, సెరాలజీ, ఇమ్యునాలజీ ఉన్నాయని తెలిపారు.